# ప్రేమయోగము భక్తిమార్గము

ప్రేమస్వరూపులారా! ప్రేమయే దైవము. ప్రేమానుబంధముచేతనే మీరందరూ ఇక్కడకు చేరగలిగారు. పదార్థమును పదార్థముతో చేర్చునది, వ్యక్తిని వ్యక్తితో కూర్చునది ప్రేమానుబంధమే. యావత్తు ప్రపంచముకూడను ప్రేమతోనే నిండియున్నది. ప్రేమ లేని జీవితము నిర్జీవితము అనే చెప్పవచ్చును.

కానీ, ఈ ప్రేమకు మూడు సోపానములున్నవి. మొదటిది ఉత్తమోత్తమ సోపానము. సమస్త జీవిలయందు ప్రేమస్వరూపుడైన పరమాత్ముడు అంతర్భూతముగా చిందులు త్రొక్కుతుంటాడనే విశ్వాసము. 'ఈశావాస్యమిదం సర్వం' 'ఈశ్వరః సర్వభూతానాం' అనే విశ్వాసము ఉత్తమోత్తములయొక్క విశ్వాసము. ఇట్టి జీవులు 'అద్వేష్టా సర్వభూతానాం'. ఇష్టులనికానీ, ద్వేషులనికానీ, దగ్గరవారనిగాని, దూరమువారనిగానీ తారతమ్యము లేక ఆనందముతో మీరు ఈశ్వరత్వాన్ని అనుభవిస్తుంటారు.

ఇక రెండవ తెగకు సంబంధించినవారు. తాను తనవారియొక్క యోగక్షేమములు తప్ప అన్యులయొక్క యోగక్షేమములను పట్టించుకోరు. అయితే వీరు ఇతరులయొక్క చెడ్డను ఏమాత్రమూ కోరరు. తమ మంచిని, తమ ఆనందమును, తమ సౌఖ్యమును, తమ అనుకూలములను కోరుతుంటారు.

ఇంక మూడవ స్థానమునకు సంబంధించినవారు. తాము సుఖసంతోషములను అనుభవించకపోయిననూ వీరు ఇతరుల ఆనందమును సహించలేరు. నిరంతరమూ పరులయందు దోషములు వెదకటమూ, పరులను దూషించటమూ, పరుల సౌఖ్య సంతోషములకు అడ్డు తగులుతూ వుంటారు. కోకిల గానము కాకులకు కరిణకఠోరముగా వుండినట్లుగా, ఇతరుల ఆనందము ఈ కాకివంటి జీవులకు కర&శ్రీకఠోరముగా వుంటుంది. హంసలను చూచి కొంగలు పరిహసించినట్లుగా ఇతరుల సుఖమును చూచి వీరు పరిహాసమాడుతుంటారు. వీరు అధమస్థానమునకు చెందినవారు.

ప్రతి జీవితవృక్షమందు ప్రేమ అనే ఫలము మధుర రసముతో కూడివుంటుంది. అయితే ఈ ఫలము తృష్ణ అనే చర్మముతో కప్పబడి వున్నది. తృష్ణ అనే చర్మమును వలచి లోపల వుండే ఈర్ష్య,అసూయ, అహంకార, స్వార్థములనే బీజములను దూరముచేసి, ప్రేమరసమును అనుభవించినప్పుడే పరమప్రేమ అనే ప్రథమస్థానము అందుకొనుటకు వీలగును.

పరమప్రేమనే ఉపనిషత్తులు రసస్వరూపము అని చెప్పుతూ వచ్చాయి. 'ఆపో జ్యోతీరసః అమృతం బ్రహ్మ'. ఇదే అమృతం. ఇదే జ్యోతి. ఇదే ఆత్మ. ఇదే బ్రహ్మ. దీనిని బడయగోరి, మానవులు మూడువిధములైన భక్తిని అనుసరిస్తున్నారు. మొదటిది భౌతిక భక్తి. రెండవది ఏకాంతభక్తి. మూడవది అనన్యభక్తి. శ్రవణ, మనన, నిధిధాయసలతో కూడినటువంటిదీ, యజ్ఞయాగాది క్రతువులతో చేరినటువంటిదీ, క్షేత్రయాత్ర, పుణ్యనదీ తీర్థయాత్ర, కీర్తన షోడసోపచారములతో కూడినటువంటిదీ, దానధర్మాది కృత్యములతో చేరినదీ. ఇవన్నియూ భౌతిక భక్తికి మాత్రమే. జపతపాది యజ్ఞముల, వ్రతములు, సంధ్యావందనములు కూడ ఈ భౌతికభక్తితో కూడినటువంటివే. ఇవన్నియూ జడములనియే చెప్పవచ్చును. ధ్యానమునందు నిమగ్నుడై అనేకవిధములైన దర్శనములను అనుభవించినప్పటికీ, అనేకవిధములైన దైవశక్తులను తాను చూచినట్లుగా భావించినప్పటికీ, ఇవి కేవలమూ భౌతికభక్తికి మాత్రమే చెందివుంటాయి. కారణమేమనగా అనిత్యమూ, అశాశ్వతమూ, అసత్యమూ అయినటటువంటి కాయముతో ఆచరించువన్నీ, అనుభవించువన్నీ, మనస్సుతో విస్మరించి మనస్సుతో విశ్వసించేటువంటివీ ఇవన్నీ కూడను జడముతో కూడినవి.

'శర్యతే ఇతి శరీరః'.జీర్నించే శరీరముతో గావించవి కనుక దీని ఫలములుకూడా జీర్నించుకుపోతాయి. 'దహ్యతే ఇతి దేహః' దహించుకుపోయేటి దేహముతో ఆచరించేవి కనుక ఇవికూడా భస్మమైపోతుంటాయి. ఇట్లని ఈ ప్రథమస్థానమునందే మాత్రము విరక్తిని కలిగియుండకూడదు. ఇది ప్రాథమిక స్థానమునకు అవసరమే.

క్రమక్రమేణా, ఏకాంతభక్తిని పొందాలి. ఏకాంతభక్తి అనగా, అనేకమంది ఏదో ఒక విగ్రహముచేతనే లేక ఒక స్వరూపము చేతనో ఏకాంతముగా వుంటుండి, తాను మనోభీష్టమురీతిగా అనుభవించటమూ, అర్థించటమూ, ఆనందించటమూ, అభిలషించటమూ అని భావిస్తుంటారు. కాదు, కాదు. మనస్సును అరికట్టి, దివ్యమైన అనుభూతియందు చేరియుండటము ఏకాంతభక్తి. మనస్సును అరికట్టమనగా కేవలము మన మనస్సును అయూ ఇయూ తిరగకుండా, ఒక్క ప్రదేశమునందు నిలబెట్టటము అని భావిస్తున్నారు. ఇది చాలా పొరపాటు. మనస్సునందు చేరిన కల్మషాన్ని, మాలిన్యాన్ని పరిశుద్ధముగావించటమే. మనస్సును అరికట్టటమంటే ఒక్క ప్రదేశములో నిలబెట్టటమని భావిస్తాము. కాని, అది నిలబడేటువంటి స్వభావము కాదు. మనస్సునకు లయమున్నదిగాని, స్థిరమనేది లేదు.

సంకల్పవికల్పములను అణగద్రొక్కటమే ఏకాంతభక్తి. సంకల్పవికల్పముల చేతనే మానవత్వమనేది దెబ్బతింటూ వస్తున్నది. ఇది ఏవిధముగా వుండాలంటే దీనికి ఒక ఉదాహరణ. భూమియందు ఎన్ని వృక్షములు పుట్టుచూ, పెరుగుచూ, నశించుచూ వుండినప్పటికీ, భూమికి ఎటువంటి బాధలూ లేవు. ఏకాంతభక్తి స్థితియందు మనస్సు అట్టి స్థిరమైన పరిస్థితియందు లయమై

వుంటున్నది. సర్వులయందూ భగవంతుడు వుండినప్పటికీ ఇట్టి లయమైన హృదయము కల్గిన వారియందు భగవంతుడు ప్రత్యక్షస్వరూపములో తన దివ్యత్వాన్ని అందిస్తుంటాడు.

తలుపుల బిగించుకొని, ఒక విగ్రహాన్ని గట్టిగా పట్టుకొని, ఇష్టము వచ్చినట్లు ఆరాధన చేసుకొని, అనుభవించుకొన్నంత మాత్రమున ఇది ఏకాంతభక్తి కాదు. ఇది ఏకాకిభక్తి. స్వస్వరూపమునందున్న ఆత్మస్వరూపుని దర్శించాలిగాని, కల్పితమైన స్వరూపాన్ని అనుభవించేది భ్రాంతి మాత్రమే. అయితే కల్పితమైన ఆరాధనలుకూడా ప్రాథమిక స్థాయిలో అవసరమే. ఎంతకాలమైననూ ఆ దశలోనే జీవితాన్ని ధారపోస్తూ రాకూడదు. అయితే ఈ మనస్సును అరికట్టటము కానీ, పరిశుద్ధముగావించుకోటముగానీ ఎట్లా? ఆకాశమున సంచరించే డేగను కూడా క్రమక్రమేనా అభ్యాసము ద్వారా మాంసమో, చేపలో చూపి , భూమి మీదకు దిగే ప్రయత్నమునకు పూనుకుంటాము. జలసంచరములను పట్టుకోటానికి మనము ఎరను చూపించుతున్నాము. పులి, సింహములనూ కొన్ని అలవాట్ల ద్వారా సర్కసులో చెప్పినట్లుగా ఆడిస్తూ వుంటున్నాము. విషదంతములతో కూడిన సర్పములనుకూడా పట్టి వాటితో ఆటలాడుతున్నారు. ఎట్లా? విషదంతములను పెరికి పారవైచినప్పుడు, మనకు యేమాత్రమూ భయము లేకుండా వుంటుంది. అదేవిధముగా మనస్సునందున్న దుర్భావములనూ, దుర్గుణములనూ దూరముచేసినప్పుడు మనస్సుకూడా ఏమాత్రమూ ప్రమాదకరమైనది కాదు.

'భావమందు దుష్టభావము వీడుటే త్యాగమగును,అదియే యోగమగును'. పవిత్రమైన భావాలచేత, పరమార్థ భావముచేత మనస్సును మార్చుకోటానికి పూనుకోవాలి. ఈవిధమైన తరిపీదు చేస్తూరాగా అంతర్భూతమైన ఆత్మదర్శనాన్ని అనుభవించవచ్చు.

మనయందు అంతర్భూతమై ఆత్మ వున్నది. కానీ, కనిపించటం లేదు. కారణం? మాలిన్యమైన పాచిదానిపైన కప్పబడి వున్నది. రాగద్వేషాలనే అలలు లేకుండా చేసినప్పుడు దుర్భావములనే కల్మలిన్ని దూరము చేసినప్పుడు, పరిశుద్ధమైన జలముగా చిత్తము రూపొందుతుంది. అప్పుడు కన్నులు మూసుకొని, మనస్సును అంతర్ముఖము చేసికొంటివా, క్షణములోనే సాక్షాత్కారాన్ని అనుభవిస్తావు. ఈ సాక్షాత్కార ప్రాప్తియే ఏకాంతభక్తి.

అనన్యభక్తి అనగా, దీనికికూడా కొన్ని విషయాలను గ్రహించాలి. 'నీవే తప్పనితఃపరంబెరుగ'నని పలుకటము అనన్యభక్తి అని భావిస్తున్నాము. 'శరణాగతి' అనన్యభక్తి అని భావిస్తున్నాము. 'నీవేతప్ప నితఃపరంబెరుగ'నని ఒక ప్రక్క చెబుతన్నాము. కానీ, ఇంకొక ప్రక్క నా బంధువులు, నావారు వున్నారని మనము విస్మరించటము లేదు, విశ్వసిస్తున్నాము. తాము తప్ప అన్యము లేదనేటువంటి భావనయే అనన్యభక్తి.

త్వమేవ మాతాచ పితాత్వమేవ త్వమేవ బంధుః సఖా త్వమేవ
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ త్వమేవ సర్వం మమ దేవదేవ.

ఇది వాచా భక్తి. ఇది హృదయభక్తి కాదు. అనన్యభక్తి హృదయపూర్వకంగా ఈ నిర్ణయము చేసుకోవాలి.

జగత్తు అంతా జడమే. జడమైన కాయముచేత జడాలను పొందుతున్నాము. జడముతో మరింత జడాన్ని అందుకుంటున్నాము. ఈ కనిపించే జగత్తు దృశ్యకల్పితమైన జగత్తే. సత్యమూ, నిత్యమూ అని భావించి మనం మోసపోతున్నాము. క్షణభంగురమైనదని గుర్తించుకోలేకపోతున్నాము. దీనికి ఒక చిన్న ఉదాహరణము. హరిశ్చంద్రుడు సత్యానికై సర్వస్వాన్ని త్యాగంచేసి, జడమైన కాయము వున్నతకాలమూ ఏదో పొట్టకూటికై మనం పాటుపడాలనే నిర్ణయానికి వచ్చాడు. పొట్టకూటినికూడా విచారించలేదు. ఇచ్చిన మాటను దక్కించుకొనుటకై కట్టకడపటికి కాటికాపరిగాకూడా పనిచేస్తూ వచ్చాడు.

ఆ సమయంలో ఒక శ్రీమంతుని కళేబరాన్ని తీసుకొని వచ్చారు శ్మశానానికి. ఆ శ్రీమంతుని వెనుక బంధువులు, మిత్రులు కొన్నివేలమంది వచ్చారు. ఆ కళేబరము చుట్టూ కట్టెలు పేర్చి నిప్పు పెట్టారు. భస్మమయ్యేవరకు కాచుకొని వున్నవాడు ఒక్క హరిశ్చంద్రుడు మాత్రమే. ఈ నిప్పు వేగముచేతను, ఆ శవము కొంచెం లేచి కూర్చుంది. తక్షణమే మళ్ళీ పడుకుంది. పాపము చక్రవర్తిగా వుండినవాడు కనుక అతనికి ఇటువంటి అనుభూతులు లేవు. లేచి కూర్చుంది కదా, బ్రతికినాడేమోనని దగ్గరకు వెళ్ళాడు. కానీ, ఆ శరీరం పడుకొని వుంది పాపం.

ప్రేమస్వరూపులారా! ముఖ్యంగా కొన్ని లౌకిక విద్యలలో, అనుభూతులతో, మార్గాలలో అనుభవముండవచ్చును. మొట్టమొదట చంద్రమండలము చేరినవాడు అనువీకున్నాడుట, 'భగవంతుడు అండపిండ బ్రహ్మాండమంతా నిండినాడని విన్నాను. ఆ నిండినవాని జాడ ఎక్కడా కనిపించలేదే! ఈ మాట కేవలమూ ఒక్క భారతీయుల భ్రాంతియే' అనుకొన్నాడుట. రాకెట్‌లో పోయే వ్యక్తి దేనితో చూచాడు? కొన్ని యంత్రాలను కంటికి తగిలించుకొని చూస్తే కనిపించేదికాదు దైవత్వము. 'ప్రేమ' అనే అద్దాలను వేసుకొని, 'విశ్వాసము' అనే మనస్సు తగిలించుకొని 'శ్రద్ధ' అనే నడకతో నడిచినప్పుడు సాక్షాత్కారమనే దైవత్వము కనిపిస్తుంది.

పరీక్షిత్ మహారాజుఏడు రోజులలో తనయొక్క కాయమును చాలిస్తున్నాడు. అతనికి ఉపదేశించటానికి వచ్చిన శుకమహర్షి సర్వసంగపరిత్యాగి. లౌకిక ఆక్షణలకుగాని, ఈ సంఖల్పవికల్పములకుగాని తనలో ఏమాత్రమూ లేవు. అలాంటి శుకమహర్షి గోపికల భక్తిని, పరీక్షిత్ మహారాజుకు వర్ణిస్తూ వచ్చాడంటే ఈ గోపికల భక్తి ఎంత పవిత్రమైనది! అప్పుడు పరీక్షిత్తు అడిగాడు, 'స్వామీ! భౌతిక

మార్గమలయందు లౌకికమౌన జీవితమును గడుపుతున్న గోపికలు అనన్యభక్తితో భగవంతుని అనుభవిస్తున్నారంటే నాకెంతమాత్రమూ విశ్వసించటానికి వీలులేనిదిగా వున్నది' అన్నాడు. దీనికి ఠక్కున సూటియైన ప్రశ్న వేశాడు ఈ శుకమహర్షి. 'పరీక్షిత్! కృష్ణుడు సామాన్యుడని విశ్వసిస్తున్నావా? భగవంతుడని విశ్వసిస్తున్నావా?' అడిగాడు. కృష్ణుడు భగవంతుడని విశ్వసిస్తే గోపికల భక్తిని విశ్వసించుటలో సందేహముండదు. కృష్ణుడు సామాన్యమైన గొల్లపిల్లవాడని అనుకుంటే నీకు చెప్పి ప్రయోజనం లేదు. కనుక, నాయొక్క వేదాంతముగాని, భాగవతముగాని దీనిపై విశ్వాసము గలిగిన వారికి చెప్పాలి. 'అనిత్యం అసుఖం లోకం' అని విశ్వసించిన వారికి చెప్పాలి. చచ్చిన వానికి ఇంకొంచెం నీరు పోసీ లాభ ంలేదు. ఆరోగ్యంగా వ్నువానికి నీరు త్రాగించవలసిన అవసరమూ లేదు. ఇటు చావూ కాక, అటు శ్రితుకూకాక మధ్యలో చాలా బాధగా వున్నవారికి ఇంకొకరు పట్టి త్రాగించాలి. కనుక, నేను చెప్పే బోధనలు అన్నీ జ్ఞానాజ్ఞానములకు మధ్యలో కొట్టుకొని పోతున్నారు చూడండి వారికి మాత్రమే నేను బోధచేస్తున్నాను.

దివ్యాత్మస్వరూపులారా! భౌతికపద్ధతిలో ప్రయాణము సలుపుతూపోతే గమ్యము చేరలేము. క్రమక్రమేణా బాహ్యదృష్టిని అంతర్ముఖము చేసుకోటానికి క్రపయత్నము చేయండి. కష్టమును, సుఖమును, నష్టమును, దుఃఖమును, విచారమును భ్రాంతులుగా విశ్వసించండి. కష్టములు లేకుండా మనకు సుఖములు లభించవు. ధనమును భద్రం చేసుకోటము మహాకష్టము. దీనిని ఖర్చుచేయటమూ మహాకష్టము. దీనిని దాచిపెట్టటము చాలా కష్టము. దానిని దాచిపెట్టటానికి, ఖర్చు చేయటానికి మనస్సు రాదు. ఖర్చు చేయకపోతే, భగవంతుడు దానికి ఒక మంచి ఉపాయము ఆలోచించుతాడు. దుర్మార్గుడైన కొడుకునిచ్చి వానితో అంతా ఖర్చు చేయిస్తాడు. లేకపోతే ఊరికే వుండడు. భగవంతుడు మెత్తగా వాడికి ఒక దత్తపుత్రునైనా కట్టి, వానిద్వారా అంతా వ్యర్థము గావింప చేస్తాడు. ఈవిధమైన పరిస్థితులు రాకముందే జాగ్రత్తగా మంచి పవిత్రమైన కార్యములూ, చర్యలూ, వినియోగములూ గావించుకొని హృదయాన్ని ఆనందముగా, నిశ్చింతగా పెట్టుకోండి. ఈవిధమైన మార్గమును అవలంబిస్తూ, ఆత్మదర్శన నిమిత్తమై మనస్సును అంతర్ముఖము గావించుకోటానికి తగిన ప్రయత్నము చేయండి.

సత్యసాయి సంస్థలవారు క్రమక్రమేణా వారి భక్తి ప్రపత్తులను ఉన్నతస్థాయికి అభివృద్ధి గావించటానికి తగిన కృషి చేయండి. ఈనాడు లోకముయొక్క పరిస్థితి చాలా దిగజారిపోయి వుంటున్నది. అంతో,ఇంతో లోకం బాగుపడుతుందనే విశ్వాసము రావాలంటే, ఆస్తికలోకము వలననే. కనుక, ఆస్తికులైన మహావీరులందరూ పవిత్రభావాలు కలిగి, శాంతులై, ప్రేమస్వరూపులై, సహనస్వభావము కలిగి, కరుణాదయలచేత, కాలమునూ, కర్మలనూ, కావించి తద్వారా సమాజమునూ, సంఘమునూ ఉద్ధరించటానికి పూనుకోండి. దైవము మీ హృదయమునందే వుండి, మీరు చేస్తున్న ప్రతి కార్యమును కూడను సహస్ర నేత్రాలతో చూస్తున్నాడు. ఎవ్వరూ చూడటం లేదని నీవు పాపానికి పూనుకోకూడదు. ఎవ్వరూ చూడకపోయినా తాను చూస్తున్నాడు. పాపభీతిచేతను, దైవప్రీతిచేతను, దివ్యమైన మార్గాన్ని అనుసరించటానికి తగిన కృషి చేస్తారని నేను ఆశిస్తున్నాను, ఆశీర్వదిస్తున్నాను.

23 జనవరి 1982 తేదీన మద్రాసునందు భక్తులకిచ్చిన దివ్యసందేశము.